ప్రజాశక్తి
గురువారం 2 నవంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కరువు కానని ప్రభుత్వం

పల్నాడులో 25 మండలాల్లో వర్షాభావం ఉన్నా స్పందన లేమి

పంటలేమీ సాగు చేసేందుకు వీల్లేక కారంపూడి మండలం ఒప్పిచర్లలో ఖాళీగా ఉన్న పొలాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నడూ లేని విధంగా పల్నాడు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం గుర్తించలేదు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఏర్పడిన తీవ్ర వర్షాభావం ప్రభావంతో 28 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులో 25 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నట్టు జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినా స్పందన లేదు. 25 మండలాల్లో సగటు వర్షపాతం నమోదు కాలేదు. సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వల నుంచి తాగునీటికి తప్ప సాగునీటికి నీటిని విడుదల చేయలేదు. ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం కంటే మూడు లక్షల ఎకరాల్లో ఏ పంటా వేయకుండా భూములు ఖాళీగా ఉంచినా ప్రభుత్వం కరువు పరిస్థితులను గుర్తించలేదు. ఇప్పటికే వేసిన పంటలు బెట్టకు వచ్చాయి. మాగాణి భూములు నెర్రెలిచ్చాయి. పత్తి బెట్టకు వచ్చింది. దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. మొదటి తీతకే అంతంతమాత్రంగా వచ్చిన దిగుబడులు రెండో తీతకు అవకాశాలు తగ్గుతున్నాయి.

అక్టోబరులో కురవాల్సిన వర్షంలో కనీసం 20 శాతం కూడా నమోదు కాలేదు. మిర్చి, వరి, పత్తి, కందిపంటలకు నీరు పెట్టుకోవడానికి రైతులు రాత్రింబవళ్లు పొలాల్లోనే తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల కాలంలో సగటు కనీస వర్షపాతం నమోదు కాలేదు. సెప్టెంబరులో కొంత మెరుగ్గా ఉన్నా అక్టోబరులో కనీస వర్షపాతం 116.77మిల్లీ మీటర్లు కాగా కేవలం 20.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అయినా ప్రభుత్వం పల్నాడు జిల్లాలో ఏ ఒక్క మండలాన్ని కరువు మండలంగా గుర్తించలేదు. ఖరీఫ్‌లో మొత్తం విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు 50 కంటే తక్కువగా సాగు అయ్యాయి. ఉద్యాన పంటల సాగుకూడా గణనీయంగా తగ్గింది. మొత్తంగా 3లక్షల ఎకరాల్లో ఎటువంటి పంటలు వేయలేకపోయారు. సాగర్

2లో

గుంటూరులో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాలు

జిల్లా ప్రగతిపై గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్ల సందేశాలు

నరసరావుపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్ తదితరులు

ఉక్కు ఫ్యాక్టరీల కోసం 8న విద్యాసంస్థల బంద్

8లో

విద్యుత్ రాయితీ బకాయిలివ్వండి

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం అలసత్వం

సహకార ఉద్యోగుల రిలేదీక్షల్లో ఎమ్మెల్సీ సాబ్జీ

ముగిసిన మూడ్రోజుల రిలేదీక్షలు

వార్త మెయిన్‌లో

ఆశాజనకమైన ధరల్లో ఎపిసిఆర్‌డిఏ ప్లాట్ల ఈ-వేలం

నవంబరు 30 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు : కమిషనర్ వివేక్ యాదవ్

ప్రజాశక్తి - విజయవాడ

సామాన్యులకు సైతం స్థిరాస్తిని ఒనగూర్చుకునే బహత్తర ఆలోచనకు ఎపిసిఆర్‌డిఎ శ్రీకారం చుట్టిందని, తమకు చెందిన నాలుగు టౌన్‌షిప్‌లలోని ప్లాట్లను ప్రజలకు ఆశాజనకమైన ధరలకే అందించటంతోపాటు సులభతర వాయిదా పద్ధతుల్లో కొనుగోలు చేసుకునే విధానాన్ని

2లో

27, 28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

గుంటూరులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, నరసరావుపేటలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. మహాధర్నా జిల్లా సన్నాహక సమావేశం బుధవారం స్థానిక బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించారు. శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల పంటలకూ ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించి, చట్టబద్ధత కల్పించాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించరాదని, కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని, కేరళలో మాదిరిగా రైతు రుణ ఉపశమన చట్టం పార్లమెంట్‌లోనూ చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఢిల్లీ రైతు పోరాటం హామీలు నెరవేర్చాలని, తదితర డిమాండ్లతో మహాధర్నా జరుగుతుందన్నారు. అనంతరం ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకష్ణ, రైతు కూలి సంఘం నాయకులు యు.నాగేశ్వరరావు, ఏరువాక రైతు సంఘం నాయకులు పి.కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మార్పులు చేస్తూ లేబర్‌కోడ్‌లు రూపొందించారన్నారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్పొరేట్ అనుకూల పంటల బీమా పథకాన్ని ఉపసంహరించుకొని, సమగ్ర ప్రభుత్వ రంగ పంటల బీమా సంస్థను ఏర్పాటు చేయాలని డమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.600కు పెంచి, పనిదినాలు 200రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు.

లకింపూరి ఖేరీలో రైతులు, జర్నలిస్టులను

2లో

గుండిమెడలో సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన విజయవాడలోని నిర్వహించే ప్రజా రక్షణ బేరిని జయప్రదం చేయాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాత్రి గుండిమెడలో సిపిఎం నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, గ్రామ కార్యదర్శి ఎన్ వి రాజ్, పి.కృష్ణ, బి.సంసోను, డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

సమస్యపై పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న గ్రామస్తులు

పది రోజులుగా తాగునీరు లేదు

ప్రజాశక్తి-పెదనందిపాడు : మండల పరిధిలోని నాగులపాడుకు వరగాని గ్రామ శివారులోని కొల్లా వారి చెరువు నుండి తాగునీరు సరఫరా చేస్తున్నా పది రోజుల నుండి సరఫరా నిలిపేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి బుధవారం తమ సమస్యను వివరించారు. పైపులైన్ చెడిపోయిందని చెబుతున్న అర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారని, పైపులైన్ రిపేర్‌కు రెండు రోజులు చాలని, పది రోజులు ఎందుకు పడుతుందని ప్రశ్నిస్తున్నారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమీపంలోని పెదనందిపాడులో కూడా తాగునీరు రావడంలేదని అన్నారు. ఆరు కిలోమీటర్ల దూరంలోనే పెద్దివారిపాలేనికి వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సి వస్తోందని, అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - తెనాలి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు (73) బుధవారం మృతి చెందారు. డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఆయన పెన్షనర్ అసోసియేషన్‌తోపాటు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం, మహాప్రస్థానం వంటి పలు సంస్థల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతి పట్ల పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణమూర్తి, సహ కార్యవర్గం తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. నాజర్‌పేటలో ఉంచిన ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు గురువారం ఉదయం జరుగుతాయని తెలిపారు.

బాల్యవివాహాలు నేరం

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ పి.ఉషారాణి అధ్యక్షతన నిర్వహించారు. యువతులకు 18 ఏళ్ళు, యువకులకు 21 ఏళ్ల సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహ రహిత పట్టణముగా తీర్చిదిద్దడానికి కషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

జిజిహెచ్‌లో రెండో రక్తనిధి కేంద్రం సేవలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పొదిల ప్రసాద్ బ్లాక్ మొదటి అంతస్తులోని రక్త నిధి రెండో యూనిట్ బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. కేంద్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సందర్శించి బ్లడ్ ప్యాకెట్లను హౌస్ సర్జన్లకు అందచేశారు. రక్తం కోసం పొదిల ప్రసాద్ బ్లాక్ నుంచి పాత ఆసుపత్రి భవనం వైపు వెళ్లాలంటే చాలా ఆలస్యంగా ఉండేదన్నారు. 60 ఏళ్లుగా పాత భవనంలో నే రక్త నిధి ఉండేదని గుర్తు చేశారు. అత్యవసర ఆపరేషన్ దియేటర్లన్ని పొదిల ప్రసాద్ బ్లాక్‌లో ఉండటం వల్ల రక్తం కోసం హౌస్ సర్జన్లు, మహిళా ఉద్యోగులు, రోగులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని, కనీసం 20 నిముషాలు పట్టేదని అన్నారు. ఆపరేషన్ థియేటర్ లలో రక్తం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చేదని అన్నారు. ఇక ఆ పరిస్థితులు ఉండవన్నారు. ఆపరేషన్‌లు ఆలస్యమవకుండా రక్తాన్ని అందించాలని, కేంద్రం 24 గంటల పాటు పని చేస్తోందని చెప్పారు.

ఎన్ఎస్ఎస్ జోనల్ స్థాయి ఎంపికలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బుదవారం ఎన్ఎస్ఎస్ జోనల్ స్థాయి ఎంపికలు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవాల్లో ఢిల్లీలో పరేడ్ నిర్వహించడానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను జోనల్ స్థాయిలో ఎంపిక చేసి వెస్ట్ జోన్ తరుపున 40 మందిని వేడుకలకు పంపుతామని ఎపి, తెలంగాణా ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఈనెల 1 నుండి 10 వరకు కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు ఆరు రాష్ట్రాల నుండి సుమారు 200 మంది బాలికలు హాజరయ్యారు. దీనిలో భాగంగా ఎనిమిది రోజుల పాటు వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన తరువాత చివరి రెండు రోజుల పాటు ఎంపికలు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పరేడ్ నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ నుండి 10 మంది వాలంటీర్లను పంపనున్నట్లు తెలిపారు. కెఎల్‌యు ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత మీదే ఆధారపడి ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో అవసరమన్నారు. ఢిల్లీలో పరేడ్ అనంతరం ఆయా రాష్ట్రాల నుండి పరేడ్ కోసం ఢిల్లీ వెళ్లిన వాలంటీర్లందరికీ ఢిల్లీలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

వడ్డేశ్వరంలో టిఎన్‌టియుసి సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని శ్రీనివాసరావు, తదితరులు

వడ్డేశ్వరంలో టిఎన్‌టియుసి ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో టిఎన్‌టియుసి (టిడిపి అనుబంధం) ఆటో యూనియన్‌ను బుధవారం టిడిపి నాయకులు ఏర్పాటు చేశారు. తెలుగుదేశం వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. టిడిపి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గం టిఎన్టియుసి అధ్యక్షులు కెటీవీ ప్రసాద్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, షేక్ నాగూర్ వలి, తదితర నాయకులు హాజరయ్యారు. అనంతరం టిఎన్‌టియుసి కమిటీ అధ్యక్షులుగా వడ్డేశ్వరం ముక్కంటి, ఉపాధ్యక్షులుగా షేక్ బాబు, కమిటీ సభ్యులు పఠాన్ అజీజ్ ఖాన్, ఇమంసను ఎన్నుకున్నారు.

ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి : పట్టణంలోని యానాదుల కాలనీలో ఎంపిపి స్కూల్ బాలబాలికలకు నూతక్కి సీతారావమ్మ జ్ఞాపకార్థం భోజనం ప్లేట్లు బుధవారం పంపిణీ చేశారు. కాలనీలోని పిల్లలకు కూడా ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్.సాంబశివరావు, ఏడుకొండలు, రవికుమార్ పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపిన కేంద్ర మంత్రి కుమారుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా డిమాండ్ల సాధనకు జరిగే ధర్నాలో జిల్లా నుండి రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ధర్నాకు హాజరయ్యే వారికి తగిన వసతి, ఆహార ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, పి.సాంబశివరావు, హనుమంతరావు, కె.రంగారెడ్డి, ఇ.అప్పారావు, బి.శ్రీనివాసరావు, కె.కోటయ్య, రంగస్వామి, ఎం.రవి, గనిరాజు, రంగారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, రైతు సంఘం నాయకులుయ యు.రాము అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవిపి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రూ.15 లక్షల కోట్లను మాఫీ చేసిందని, రైతుల రుణమాఫీకి సాకులు చెబుతోందని విమర్శించారు. కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులకిచ్చిన ఏ ఒక్క హామీనీ కేంద్ర నెరవేర్చలేదన్నారు. రానున్న కాలంలో కార్మిక, కర్షక వర్గాలు పెద్ద ఎత్తున ఆందోళన సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అఖిల భారత రైతు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు టి.ఆంజనేయులు, తెలుగు రైతు విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్ బాబు, వెంకటరత్నం, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శిలు గుంటూరు విజయ్ కుమార్, ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు చేసే పోరాటాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. సదస్సులో వివిధ సంఘాల నాయకులు కె.రాంబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్, శ్రీనివాసరావు, యు.రంగయ్య, టి.బాబురావు, బి.రామ కృష్ణ, డి.శివకుమారి, సిలార్ మసూద్, కె.రామారావు, జి.బాలకృష్ణ, సత్యనారాయణరాజు, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆశాజనకమైన ధరల్లో ఎపిసిఆర్‌డిఎ ప్లాట్ల ఈ-వేలం

(మొదటి పేజీ తరువాయి)

మరింత చేరువ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివద్ధి ప్రాధికార సంస్థ (ఎపిసిఆర్‌డిఎ) కమిషనర్ వివేక్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొండిగించినట్లు తెలిపారు. కొనుగోలుదారులు ఈ-వేలంలో పాల్గొనే ప్రక్రియ సరళంగా ఉండాలని, చరవాణి ఓటీపీ ద్వారా ప్లాట్లు నమోదు చేసుకునే సులువైన సాంకేతిక పద్ధతులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పరిధిలోని నాలుగు టౌన్షిప్లలో సౌకర్యాలతో కూడిన ప్లాట్ల వివరాలు, తగ్గించిన ధరలను ప్రభుత్వ కొనుగోలు పోర్టల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. విజయవాడ పాయకాపురం టౌన్షిప్, తాడేపల్లి-మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో అమరావతి టౌన్‌షిప్, తెనాలి చెంచుపేట టౌన్షిప్, ఇబ్రహీంపట్నం ట్రక్కు టెర్మినల్ టౌన్షిప్ల వాణిజ్యపరంగా అభివద్ధి చెందుతున్న ప్రాంతాల్లో 415 నివాస/వాణిజ్య సౌకర్యాలతో కూడిన 18 లాట్లలోని ప్లాట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మంగళగిరి ఎంఐజీ లే అవుట్లో 200, 240 చదరపు గజాల ప్లాట్లు ఉన్నాయని వివరించారు. ప్లాటు ధర చదరపు గజానికి రూ.17,499గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈవేలం దరఖాస్తులు కొనుగోలు పోర్టల్ https://konugolu.ap.gov.in ఎపిసిఆర్‌డిఎ https://crda.ap.gov.in లో నవంబరు ఒకటో తేదీ నుండి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వెబ్సైట్ ద్వారా ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను సమర్పించాలని కోరారు. డిసెంబరు 11వ తేదీ ఉదయం 11 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈవేలం నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 0866 – 2527124 ఫోను నంబరులో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

కరువు కానని ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

జలాశయానికి ఈ ఏడాది ఎగువ నుంచి నీరు రాలేదు. సాగైన పంటల్లో కూడా దిగుబడి 50 శాతం కంటే తక్కువగా రావచ్చునని అధికారులు అంచనా వేశారు. దీంతో అన్ని మండలాలను కరవు మండలాలుగా గుర్తించాలని జిల్లా అధికారులు ఇచ్చిన నివేదికపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు.

గతేడాది కంటే ఈ ఏడాది వర్షపాతం 28మండలాలకు 25 మండలాల్లో 50 శాతం కన్నా తక్కువగా ఉన్నట్టు నివేదికలు ఇచ్చారు. పత్తి, వరి, మిర్చి, కంది పంటలు దిగుబడి గణనీయంగా తగ్గుతుందని వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. నేలలో తేమ తగ్గిపోతోంది. అన్నిరకాల పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయినా ప్రభుత్వం తగిన అధ్యయనం చేయలేదు. పల్నాడు జిల్లాలో లక్షా 12 వేల ఎకరాలకుగాను కేవలం 28 వేల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. జిల్లాలో మొత్తం 6.80 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది సాగు చేస్తారని అంచనా కాగా ఇప్పటి వరకు 3.80 లక్షల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలను సాగు చేశారు. పత్తి 1.54 లక్షల ఎకరాలు, మిర్చి 1.24 లక్షల ఎకరాలు, కంది 40 వేల ఎకరాలు,వరి 28 వేల ఎకరాలు, ఇతర పంటలు మరో 34 వేల ఎకరాల్లో సాగు అయ్యాయి. ఖరీఫ్‌లో ఏ పంట వేయని 3 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేయాలన్న రైతుల సంకల్పం నెరవేరలేదు. అక్టోబరులో తీవ్ర వర్షాభావం వల్ల జొన్న, మొక్కజొన్న సాగు చేయడానికి కూడా అవకాశాలు సన్నగిల్లాయి. పల్నాడు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోలేదు. ఇంత వరకు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చిన దాఖలాలు లేవు. మంత్రులు, ఎమ్మెల్యేలు గత రెండు నెలలుగా ఈ అంశంపై చర్చించలేదు.

టిప్పర్ ఢీ కొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి- తాడేపల్లి : కనకదుర్గ వారధిపై బుధవారం రాత్రి టిప్పర్ ఢీ కొని ఇద్దరు మృతి చెందారు. కృష్ణాజిల్లా ముదినేపల్లికి చెందిన డేగల సుబ్బా రావు (50), దాసరి నాగదుర్గ (28)లు మణి పాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి బంధువులను పరామర్శించి వస్తుం డగా ఈ ప్రమాదం జరిగింది.ఆసుపత్రికి సమీపంలో విజయ తవాడ నుండి వస్తున్న టిప్పర్ వెనక నుంఇ వీరిని ఢీ కొట్టడంతో సుబ్బారావు, నాగదుర్గ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మంగళగిరి ఆస్పత్రికి తరలించారు.

గొడ్డలితో గంజాయి బ్యాచ్ హల్‌చల్ !

ప్రజాశక్తి - తాడేపల్లి: తాడేపల్లి ముగ్గురోడ్డు సెంటర్లో, ఇందిరా గాంధీ బొమ్మ దగ్గర ఒక దుకాణపై మత్తులో ఉన్న గంజాయి బ్యాచ్ దాడి చేసింది. అప్పు ఇవ్వలేదన్న కారణంతో దుకాణదారులను గొడ్డలితో బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారు. సామాన్లను ధ్వంసం చేశారు. ఈ సంఘటనపె బాధి తులు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ నుంచి వెలివేయ బడ్డ రౌడీ షీటరు ముఖ్యంగా ముగ్గురోడ్డు పరిసర ప్రాం తాల్లో ఆవాసాలుగా మార్చుకున్నారు. చిన్న చిన్న గ్యాంగ్‌లుగా ఏర్పడి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు.

సర్పంచ్ ఫిర్యాదుపై డిపిఒ విచారణ

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

గ్రామాభివృద్ధిలో జాప్యం జరుగుతోందని ఫిర్యాదు నేప థ్యంలో మండలంలోని వెనిగండ్ల పంచాతీని డిపిఒ శ్రీదేవి, డిఎల్‌పిఒ లక్ష్మణరావు బుధవారం సందర్శించారు. అభివృద్ధి పనులకు బోర్డు సభ్యులే అడ్డు పడుతున్నారని, తీర్మానాలకు సహకరించడం లేదని ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌లో సర్పంచ్ ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. సర్పంచ్ వి.శ్రావణి, ఉప సర్పంచ్ కె.వెంకటరెడ్డి, ఇన్‌ఛార్జి సెక్రటరీ హరిబాబు, వార్డు సభ్యుల నుండి వివరాలు సేకరించారు. వీటిని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని డిపిఒ చెప్పారు.

బాణసంచా కాల్చినందుకు వైసిపి కార్యకర్త దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో మంగళవారం రాత్రి, టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్యన ఘర్షణ చోటు చేసుకుంది.ంతెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు మంగళవారం మధ్యంతర బెయిల్ కోర్టు ఇవ్వడంతో తెలుగుదేశం శ్రేణులు తాడేపల్లి రూరల్ గ్రామాలలో భారీగా బాణ సంచా పేల్చారు. గుండిమెడ గ్రామంలో తెలుగుదేశం కార్యకర్త బొజ్జ సాంబశివరావు బాణాసంచా కాల్చే సమయంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త మేరుగా రాజేష్ (సుబ్బు) ఆక్రోషంతో సాంబశివరావును గుండెలపై కాలుతో బలంగా తనడంతో సాంబశివరావు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గుండెలపై రాజేష్ బలంగా తన్నడం వలన టిడిపి కార్యకర్త సాంబ శివరావుకు శ్వాసకు ఇబ్బంది కలిగి,ఊపిరాడలేదు. ఇది గమనించిన సాంబ శివరావు కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్ కి ఫోన్ చేసి, సాంబశివరావుకి వైద్యం అందించేందుకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. దీంతో కొద్ది సేపు తెలుగుదేశం, వైసిపి కార్యకర్తలు ఘర్ష ణకు దిగారు. తాడేపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో ఘర్షణ సద్దుమణిగింది. అయితే ఘర్షణకు కారణమైన వైసీపీ కార్యకర్త రాజేష్ పై కేసు నమోదు విషయాన్ని తాడేపల్లి పోలీసులు తెలపకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది.

దాడితో కుప్పకూలిన సాంబశివరావు

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ .3 లక్షల ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో బస్టాండ్ కాంపౌండ్ వాల్‌ని అనుకోని ఉన్న ఇంట్లో దొంగలు పడి నగదు, నగలు అపహరించుకుపోయారు. గృహ యజమాని రంగా జనార్ధన్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 28వ తేదిన ఊరుకు వెళ్ళినట్లు తెలిపారు. నవంబర్ 1వ తేదిన బుధవారం ఉదయం వచ్చి చూడగా తమ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. పరిశీలన చేయగా షుమారు 200 గ్రాముల బంగారం, కిలో వెండి వస్తువులు, 15నుండి 20 వేల వరకు నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వారు వచ్చి పరిశీలన చేసి క్లూస్ టీమ్ ను పిలిపిస్తామని అప్పటి వరకు అన్ని వస్తువులను తాకవద్దని పోలీసులు తెలిపినట్లు జనార్ధన్ తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చి పరిశీలన చేసినట్లు అర్బన్ పోలీసుస్టేషన్ ఎస్.ఐ సౌందరరాజన్ తెలిపారు. పట్టణంలో ఈ మధ్య కాలంలో తరుచుగా దొంగ తనాలు జరుగుతున్నాయి. ఊరి బయట ఉన్న దేవాలయాలలో కూడ చోరిలు జరగటం, వాటిపై ఫిర్యాదులు కూడ చేయటం జరిగింది. ద్విచక్రవాహ నాల దోంగతనాలు కూడ తరుచుగా జరుగుతున్నాయి. పోలీసులు ప్రత్యేక శ్రద్దతో టీమ్‌లను ఏర్పాటు చేసి దోంగతనాలను ఆరికట్టాలని ప్రజల కోరుతున్నారు.

గృహ యజమాని రంగా జనార్ధన్

చంద్రబాబు తప్పుచేయరు : పుల్లారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నిప్పులాంటి చంద్రబాబు తప్పు చేయరు, చేయనివ్వరు అనడానికి జైలు నుంచి విడుదల సందర్భంగా లభించిన అపూర్వ జన సాగ్వతాలే నిదర్శనమని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రభుత్వం, పోలీసులు విధించిన ఆంక్షల మధ్య కూడా దారి పొడవునా వేలాదిమంది తరలిరావడం చూస్తే వారి గుండెల్లో చంద్రబాబు స్థానమేంటో చాటి చెప్పినట్లైంది పేర్కొన్నారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్తిపాటి మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రజల ప్రార్థనలు ఫలించి ఇన్ని రోజుల కుట్రల చీకట్లు చీల్చుకుని చంద్రబాబు తిరిగి జనంలోకి వచ్చిన ఈ సందర్భం ఎంతో ప్రత్యేకంగా నిలిచిపోతుందని చెప్పారు.

చంద్రబాబును కలిసిన వారిలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, టిడిపి నాయకులు దూళిపాళ్ల నరేంద్ర, కన్నా లక్ష్మీనారాయణ, జి.వి.ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కమార్, నన్నపనేని రాజకుమారి, కొవెలమూడి రవీంద్ర, నశీర్ అహ్మద్, కొమ్మాలపాటి శ్రీధర్, డేగల ప్రభాకర్, రావిపాటి సాయి తదితరులు చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు. సాయంత్రం 5 గంటలకు చంద్రబాబు ఉండవల్లి నుంచి హైదరాబాద్ వెళ్లారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక మంగళ్‌దాస్ నగర్, సీతానగరం కాలనీలో నాలుగు రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్ వల్ల ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన షేక్.అమీర్‌భాష కుటుంబానికి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆర్థిక సాయం అందించారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అమీర్ భాష, ఆమె భార్య, ఇద్దరు పిల్లలు అగ్నిప్రమాదంలో ప్రాణాలు దక్కించుకొని బయటపడ్డారు. ఈ విషయం నగర మైనార్టీ నాయకులు షేక్.నాగుల్‌మీరా ద్వారా తెలుసు కున్న పారేపల్లి మహేష్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి నిత్యావసర సరుకులు, కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు జిల్లా మహిళా కోఆర్డినేటర్ కె.స్వాతి, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు వి.శ్రీనివాస్, నాగుల్‌మీరా, బిట్రా ప్రసాద్, నూతక్కి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 35,478
మిర్చి ఎగుమతి	: 35,076
మిర్చి నిల్వ	: 12,899

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 24,000
నెం.5	10,000 - 21,000
273	18,000 - 20,500
341	10,500 - 21,500
4884	14,000 -18,500
	నాన్ ఎసి
తేజ	10,000 - 24,200
బడిగి	12,000 - 26,000
దేవనూరు డీలక్స్	16,000 - 22,000
తాలుకాయలు	7,000 -14,500
	ఎసి
334	9,800 - 22,800
నెం.5	11,000 - 14,000
273	21,000 - 21,000
341	10,000 - 21,000
4884	20,500 - 20,500
సూపర్ 10	21,500- 22,000
తేజ	11,500 - 24,500
బడిగి	10,500 - 26,000
దేవనూరు డీలక్స్	16,500 - 22,000
తాలుకాయలు	6,000 -13,000

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

OS 228/2015 E.P 2/2023 EA 33/2023.

Between:-
సయ్యద్ నాగూర్ మీరా ..... పిటిషనర్/DHR
V/S
నాదెండ్ల ప్రసాదరావు ... వగైరాలు/ రెస్పాండెంట్లు.
To,
R1) నాదెండ్ల ప్రసాదరావు S/o రత్నం
D.No 7-6-846/175/444, 2వ లైన్,
సమతా నగర్, గుంటూరు.

పై నెంబరు అమలు దరఖాస్తులో 5వ జె డి ఆర్ చనిపోయినందున 6 to 8 రెస్పాండెంట్లను వారసులుగాను మరియు 6 to 8 JDRS గాను చేర్పించమని L.R పిటిషన్ దాఖలు చేయగా మీకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేయించనను మీకు ముట్టనందున సబ్స్టిట్యూట్ సర్వీస్ ద్వారా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 16-11-2023వ తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల ఎక్స్ పార్టీ చేసి మీ పరోక్షమందు తీర్మానించబడును తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులతో

వాయిదాతేది:16-11-2023.

ఇట్లు.
సయ్యద్ బాజీ బాబు, అడ్వకేట్ గుంటూరు.
పి.శ్రీనివాసరావు అడ్వకేట్, చిలకలూరిపేట.
పిటిషనర్/ డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాదులు.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...

IP.No 12/2022

Between:
గ్రంధిశిల లక్ష్మీనారాయణ S/o ఆంజనేయులు
D.No:4-470/3, పాటిమీద బజార్, వినుకొండ పట్టణం మరియు మండలం.
వినుకొండ జెసి జెసి.. ...పిటిషనర్.
V/S
కజ్జాయం సీతారామయ్య, మరియు
24 మంది ఇతరులు .... రెస్పాండెంట్లు
R3) కంచుమాటి సుబ్బారావు S/o చిన్న వెంకయ్య,
వ్యాపారం, D.No:5-21/53, విష్ణుకుండి నగర్,
వినుకొండ పట్టణం మరియు మండలం వినుకొండ,
పల్నాడు జిల్లా.

సదరు పై నెం. పిటిషన్ లోని పిటిషనర్ తనను ఇన్సాల్వెంట్ గా ప్రకటించమని ఇందలి రెస్పాండెంట్లపై ఐపి దాఖలు చేసి ఉన్నారు. సదరు శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేసినందున ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం తెలియజేయడమైనది. 10-11-2023 వ తేదీకి వాయిదా ఉన్నది.సదరు వాయిదా తేదీన ఉదయం 10:30ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా లేదా న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

వాయిదా..ది. 10-11-2023.

ఇట్లు.
బొల్లా సురేష్,
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
Cell No:- 9676765777.

IN THE COURT OF THE AGENT TO THE GOVERNMENT(DISTRICT COLLECTOR) BHADRADRI-KOTHAGUDEM DISTRICT AT KOTHAGUDEM

H.M., O.P., No.44/2021

బిట్వీన్:
బాదం నరసింహారెడ్డి, (ఆధార్ నంబర్.9970 1877 7051) తండ్రి వెంకటరెడ్డి, వయసు:41 సం॥, వృత్తి: ఉద్యోగం పేపర్ బోర్డు సారపాక గ్రామం, నివాసం: నగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామం, బుర్గంప్హాడ్ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. ...వాది
మరియు
బాదం ఆదిలక్ష్మి, భర్త నరసింహారెడ్డి, వయసు:33 సం॥, వృత్తి:గృహిణి, తండ్రి:లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నివాసం: దొడ్లేరు గ్రామం, క్రోసూరు మండలం, గుంటూరు జిల్లా. ...ప్రతివాది

నోటీసు

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియపరచునది ఏమనగా ని భర్త బాదం నరసింహారెడ్డి పైన తెలిపిన కోర్టు నందు విడాకుల కొరకు దావా వేసినారు. మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనలేదు. కావున పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియపరచు చున్నాము. విడాకుల కేస్ ది.8-12-2023 న మధ్యాహ్నం సమయం 3 గంటలకు జిల్లా కలెక్టరు కార్యలయము భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నందు కేసు విచారణ కలదు. కావున మీరు స్వయంగా గాని లేక మీ న్యాయవాది ద్వారా గాని హాజరు కాగలరు లేని యెడల కోర్టు వారి ముందువున్న రికార్డు ప్రకారం కేసు తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//

భద్రాచలం,
డేట్:30-10-2023

గోడపర్తి నాగరాజు,
వాది తరుపు అడ్వకేట్,
భద్రాచలం-507111,
సెల్.నెం.9440779415

General Notice
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE: GUNTUR
SOP No:64/2023

Between:
Namburi Pavani ,W/o.N.Srinivasarao,
2) Aravapalli Lakshmi Pallavi,
W/o.A.Venkata Satya Niranjan,
3) Kothamasu Lakshmi Satya Prathima,W/o.Puvvadi Raja, All are R/o. Door No:21-7-35, Sangadigunta, Vangavariveedhi, Guntur-3. .. Petitioners
And
REC LIMITED (Formerly known as Rural Electrification Corporation Ltd.)
(A Government of India Enterprise) Regd. Office: Core-4, SCOPE Complex, 7, Lodhi Road, New Delhi ...Respondent

పై నెంబరు S.O.P లోని పిటీషనర్ల తండ్రి గారు అయిన కొత్తమాసు సుబ్బారావు గారు జీవించియున్న కాలంలో రెస్పాండెంట్ కంపెనీ వద్ద ది:31-10-2019న 155 బాండులను సర్టిఫికేటు నెం:359471 గా కోనుగోలు చేసి,నామినీగా తన భార్యను నియమించినారు. సదరు సుబ్బారావు & ఆయన భార్య ఇరువురు మరణించిన దర్మిలా వారి తాలుకు రెస్పాండెంట్ కంపెనీ లోని షేర్లు పిటీషనర్లు పేర్లతో పొందుటకు వారసత్వ సర్టిఫికేట్ కొరకు పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ పై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములు ఉంటే తెలుపుకొనవలసినదిగా కోరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం ది: 07-12-2023 కి వాయిదా వేసినారు. ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి యెదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 07-12-2023

లక్కి సుబ్బయ్య,
శ్రవణ్ త్రిపురమల్లు,
పిటీషనర్లు తరపు న్యాయవాదులు,
గుంటూరు.

ఆరుతడి పంటలకు నీటిని విడుదల చేయండి

ప్రజాశక్తి-నకరికల్లు

సాగర్ లో ఉన్న నీళ్లు ఆరుతడి పంటలకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కుంకలగుంటలో మూడో రోజు ప్రజా చైతన్య యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కోట్లాది మంది తెలుగు ప్రజలు సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలన్నారు. ఈనెల 7వ తేదీన బస్సు యాత్ర సత్తెనపల్లి చేరుకుంటుందని చెప్పారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో అనుముల లక్ష్మేశ్వర్ రెడ్డి, శివకుమారి, షేక్ సిలార్, తాళ్లూరి పెద్దిరాజు, గుంటూరు మల్లేశ్వరి, ఈ ఊరి అప్పిరెడ్డి, లక్ష్మారెడ్డి, జి.పిచ్చారావు, చట్టు కోటేశ్వరరావు, దుర్గాబాయి, ఆవుల వెంకటేశ్వర్లు, గుంజి కొండలు పాల్గొన్నారు

కుంకలగుంటలో నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్రలో గుంటూరు విజయ్‌కుమార్

వరి రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి-క్రోసూరు

లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల ద్వారా క్రోసూరు చెరువు నింపి ఎద్దు వాగుకు వదలడం ద్వారా దాని పరీవాహక ప్రాంతంలో వరి సాగు చేసే రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మండలంలోని బాలమర్రు, అందుకూరులలో బుధవారం జరిగింది. ఎద్దు వాగు పరీవాహ ప్రాంతమైన అందుకూరు, బాలెమర్రు ,బయ్యవరం గ్రామాల్లో ఆరేడు వందల ఎకరాల వరి సాగు చేసి ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి పెట్టారని, ఎద్దు వాగు ఎండిపోవడంతో సాగునీరు అందక పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ పంటలను కాపాడటానికి కృష్ణా నది మీద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల ద్వారా క్రోసూరు చెరువు నింపి, ఎద్దు వాగుకు నీటిని వదలాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న కందిపప్పు కూడా కరువైందని, విద్యుత్ ఛార్జీలు తీవ్రంగా పెరిగాయని వ్యవసాయ కార్మిక మహిళలు చెప్పారని అన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీలకు ఇస్తున్న ఉపాధి హామీ డబ్బుల బిల్లులు సకాలంలో రాక ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. దేశాన్ని అప్పుల పాలు చేస్తూ, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మోదీ ప్రభుత్వం ప్రజల మీద భారాలు వేస్తోందని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. అటువంటి మోడీ ప్రభుత్వానికి వంతపలుకుతున్న రాష్ట్రంలోని రాజకీయ పార్టీలను ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టే ఆందోళన, ఉద్యమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, చిలక యేసయ్య, డి. నటరాజ్ , షేక్ ముస్తఫా, జి.చిన్నప్ప పాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్రలో జి.రవిబాబు

నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో

చిన్న పిల్లల మెదడు, నరాల వ్యాధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రముఖ పిడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.నటరాజ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు మెదడు నరాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు సమర్ధ వంతమైన వైద్య సేవలు తమ హాస్పిటల్ లో నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత ప్రముఖ జనరల్, నరాల వైద్య నిపుణులు డాక్టర్ నెల్లూరి రమేష్ చెప్పారు. ఈ సందర్భంగా రమేష్ ప్రజాశక్తితో మాట్లాడుతూ పిడియాట్రిక్ న్యూరాలజి లో విశేష అనుభవజ్ఞులైన డాక్టర్ పి.నటరాజ ప్రతి మంగళవారం సత్తెనపల్లి రోడ్డులోని తమ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటారన్నారు. తమ హాస్పిటల్‌లో పిడియాట్రిక్ న్యూరాలజి వైద్య సేవలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న పిల్లల్లో వచ్చే మూర్ఛ, ఎదుగుదల లోపం, మాటలు రాకపోవడం, ఆలస్యంగా నడవడం, మెదడు వాపు జ్వరం, నెలలు తక్కువ పుట్టిన పిల్లలకు ఎదుగుదల, జ్ఞాపకశక్తి సమస్యలు,కండరాల వ్యాధులు, తలనొప్పి, అటిసం, హైపర్ ఆక్టివిటీ మరియు చిన్న పిల్లలలో కనిపించే పక్షవాత లక్షణాలకు అధునాతన వైద్య సేవలు డాక్టర్ పి.నటరాజ ఆధ్వర్యంలో సమర్థ వంతంగా వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తమ హాస్పిటల్ లో నరాలు జనరల్ వైద్య సేవలతో పాటు డాక్టర్ బెల్లం అనూష (నెల్లూరి) ఆధ్వర్యంలో చర్మ సౌందర్య వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

లాభాపేక్షకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిం చాలనే లక్ష్యంతో స్థాపించిన తమ వైద్య సేవలను పల్నాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 08647 222199, 9441728744 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

డాక్టర్ నెల్లూరి రమేష్

వినుకొండ జర్నలిస్టులకు

భారత్ ప్రెస్ ఫొటో అవార్డులు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రపంచ ఫోటో జర్నలిజం వేడుకల సందర్భంగా జరిగిన ఫోటో కాంపిటషన్‌లో జర్నలిస్టులు వంగపల్లి బ్రహ్మయ్య, కేసానపల్లి సుబ్బారావుకు భారత్ ప్రెస్ ఫొటో అవార్డులు లభిం చాయి. వీరిద్దరూ స్పోర్ట్స్ విభాగంలో అప్రిసియేషన్ అవార్డ్స్ ,గోల్డ్ మెడల్,చెరో రెండు వేల రూపాయలు ప్రైజ్ మని అందుకున్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక,సంస్కృతి సమితి ,ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్, ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రపంచ ఫోటో జర్నలిజం దినోత్సవ వేడుకలు విజయవాడలోని బాలో త్సవ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన జర్నలిస్టుల ఫోటో కాంబినేషన్లో విను కొండ చెందిన జర్నలిస్టులకు స్పోర్ట్స్ విభాగంలో అవార్డ్స్ కు ఎంపికయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ పత్రికలలో, చానల్స్ లో పనిచేసే ఫోటో జర్నలిస్టుల ప్రతిభను గుర్తించడానికిగాను సీనియర్ ప్రెస్ ఫోటోగ్రాఫలకు మెమోరియల్ అవార్డులు అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల జర్నలిస్టులు,ఫోటోగ్రాఫర్‌లు తమ ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ పురస్కారాలను అందుకోవాలని ఫోటో గ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా ఫౌండర్ చైర్మన్ గ్రాండ్ మాస్టర్ తమ్మ శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. అవార్డు గ్రహీతలను వినుకొండ నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు, ఫోటోగ్రాఫర్లు అబినందించారు.

స్పోర్ట్స్ విభాగంలో అవార్డులు పొందిన చిత్రాలు

ప్రశంసాపత్రాలు అందుకుంఉటన్న జర్నలిస్టులు వంగపల్లి బ్రహ్మయ్య, కేసానపల్లి సుబ్బారావు

జెసి ఎ.శ్యాం ప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థినులు

దాతలు ముందుకు రావాలి : జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం,ఆనంద నిలయం వసతిగృహాలను జాయింట్ కలెక్టర్ సందర్శించారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ విశ్రాంత ఉద్యోగి జూపూడి ప్రసాద్ తన తల్లిదండ్రులు జూపూడి డేవిడ్ , నాగమ్మ జ్ఞాపకార్థంగా రూ.40 వేలు విలువైన శుద్ధ జల యంత్రం, 2 సింటెక్స్ ట్యాంక్ లు పైపులు వితరణ చేశారు. ఆయా వసతి గృహాలకు రంగులు వేసేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జూపూడి ప్రసాద్ ను జాయింట్ కలెక్టర్ అభినందించారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరు సేవా భావంతో ముందుకు రావాలని, వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యసిస్తున్న పేద పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

యడ్లపాడు తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యడ్లపాడు తహశీల్దార్ కార్యాల యాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇన్చార్జ్ తహశీల్దార్ సుజాత ద్వారా కార్యాలయ విధులకు సంబంధించిన కార్యకలాపాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. 3 పేజ్ రీ – సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసైన్ మెంట్ ల్యాండ్స్, విలేజ్ సర్వేస్ ఇమాంసు, ముటేషన్లు బై కరెక్షన్స్, ముటేషన్ బై ట్రాన్సిషన్స్, సబ్ డివిజన్లు, ఎఫ్– పిటిషన్లు, ల్యాండ్ కన్వర్షన్ ఆఫ్ అగ్రికల్చరల్, నాన్ అగ్రికల్చరల్ భూములకు సంబంధించి తనిఖీ చేశారు.

బదిలీ అయిన సర్వేయర్‌కు సన్మానం

ప్రజాశక్తి-నకరికల్లు

మండల సర్వేయర్‌గా పని చేస్తున్న చంద్రబాబు బదిలీపై మంగళ గిరి మున్సిపాలిటీకి వెళుతున్నట్లు తహశీసిల్దార్ నగేష్ బుధవారం తెలిపారు. గ్రామాల్లోని రైతులకు రెవెన్యూ సర్వే సేవలు చక్కగా అందించారని కొనియాడారు. మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆశించారు. అనంతరం చంద్ర బాబును తహశీల్దార్ కార్యా లయం సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ఉపాధి హామీ పనులు గుర్తించాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

రానున్న సంవత్సరానికి ఉపాధి పనులను గుర్తించాలని పెదకూరపాడు మండల ఎపిఒ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కువ మందికి ఉపాధి కలిగే విధంగా పనులు గుర్తించడం చేయాలన్నారు. పొలం వెళ్లడానికి కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఏలు, ఈసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించిన పాలకపార్టీలు

- వాటిని వెలుగులోకి తెచ్చేందుకు సిపిఎం బస్సుయాత్రలు
- 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ
- జయప్రదం కోసం సిపిఎం శ్రేణుల ప్రచారాలు

గుంటూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న నళినీకాంత్

తెనాలిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు, అనంతరం నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారాన్ని స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రజా ప్రణాళికను విడుదల చేసి ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు వంత పాడుతున్నాయని, పట్టణ సంస్కరణల పేరుతో చెత్త పన్ను విధింపు, ఆస్తిపన్ను పెంచి భారం మోపారని అన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి పట్ల రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన అంటకాగుతున్నాయని దుయ్యబట్టారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రజలు వేలాదిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ.చిష్టీ, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు ఆది నికల్సన్, షేక్ ఖాసింవలి, బి.సత్యనారాయణ, నగర నాయకులు షేక్ బాషా సుభాని, ఆంజనేయులు పాల్గొన్నారు.

టింబర్ ముఠా కార్మికులతో సభ..

స్థానిక మస్తాన్‌దర్గా వద్ద గల టింబర్ ముఠా కార్మికులతో నిర్వహించిన సభలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ప్రసంగిచంచారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, లీటర్ పెట్రోలు రూ.60కి, డీజిల్ రూ.50లు, వంటగ్యాస్ 400లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగే బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర రాయలసీమ నుండి బయలుదేరి 9న మంగళగిరికి వస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు తెలిపారు. మంగళగిరితో యాత్రను, విజయవాడలో 15న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు మండలంలోని చిలువూరులో బుధవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం చేపట్టారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బొమ్మ సెంటర్లో జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ చిలువూరులో ఎస్సీలకు శ్మశాన స్థలం లేక అవస్థ పడుతున్నారని, సత్వరమే భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. తుమ్మపూడిలో తాగునీటి పైపులేసి 15 ఏళ్లవుతున్నా ఇప్పటికీ నీరు సరఫరా చేయలేదని, మార్టిన్ సామాజిక తరగతి వారికి కుల ధ్రువపత్రాలు ఇవ్వకుండా నెలల తరబడి ఆర్‌డిఓ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. వీరికి తహశీల్దార్ ద్వారానే ధ్రువపత్రాలు ఇవ్వాలన్నారు. రేవేంద్రపాడు వద్దమద్రాస్ కాల్వపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజల ఆందోళన చెందుతున్నారని, వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మేడికొండూరులో ప్రచారం

ప్రజాశక్తి - తెనాలి రూరల్

విజయవాడలో 15న జరిగిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.బాబుప్రసాద్ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆవిష్కరించారు. షేక్ హుస్సేన్‌వలి, పి.జోసెఫ్, జి.వెంకట సుబ్బయ్య, ఎం.సాంబశివరావు, ఎస్.ఏసేబు, జి.రాంబాబు, డి.పవన్‌తేజ, డి.వర్ధన్, డి.శంకర్, బి.నాగేశ్వరరావు, కె.రాజేష్, కె.వెంకట్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

నాగులపాడు, వరగాని, పెదనందిపాడులో ప్రచారాన్ని సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు ప్రారంభించారు. బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందని, స్త్రీలు, మైనార్టీలు, అణగారిన వర్గాలకు రక్షణ కరువైందని చెప్పారు. వ్యవసాయ కునారిల్లుతూ ప్రజలకూ ఉపాధి కరువైందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రత్యామ్నాయ ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్తోందని చెప్పారు. రూపాయికే యూనిట్ విద్యుత్‌ను, రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను, రూ.60కే లీటరు పెట్రోలును ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు తగ్గించాలని, అర్హులందరికీ రూ.5 వేల పింఛనివ్వాలని, ఇల్లులేని పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం అందించాలని కోరారు. చెత్త పన్నును రద్దు చేయాలన్నారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని కోరారు. ఈ అంశాలతోపాటు అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పోరాడుతోందని, ఆ ఉద్యమాల్లో ప్రజలు కలిసి రావాలన్నారు. ఎం.వెంకటేశ్వర్లు, సిహెచ్.యానాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

స్థానిక ఇందిరా కాలనీలో సిపిఎం నాయకులు ప్రచారం చేపట్టారు. కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, సిహెచ్ చిన్న, శౌరి, శ్రీనివాసరావు, పి.లూర్థు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాలను తగ్గించడంతో పాటు గ్యాస్, పెట్రోల్ ధరలను నియంత్రించాలని కోరారు. సిపిఎం ప్రజా రక్షణ భేరి సందర్భంగా ఈ నెల 15న చలో విజయవాడకు స్కీమ్ వర్కర్లు తరలిరావాలని కోరారు. బుధవారం ప్రకాష్ నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో స్కీమ్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంతమ్మ, సుగుణ, లక్ష్మి, మరియమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్దోషిగా నిరూపితం కాలేదు

రాజకీయాల్లో ఎప్పుడేమైనా జరగొచ్చు : ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి - మంగళగిరి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దోషి కాదని, అసలు కుంభకోణమే జరగలేదని ఆయన తరపు న్యాయవాదులు ఎక్కడా వాదనలు వినిపించలేదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అంధ్రరాష్ట్ర అవతరణలో పాల్గొన్న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ న్యాయస్థానం తీర్పునకు అందరం కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. చంద్రబాబుకు కంటి ఆపరేషన్, ఇతర అనారోగ్య కారణాల దష్ట్యా ఇచ్చిన బెయిల్ మాత్రమేనని, దీన్ని టిడిపి నేతలు మర్చిపోయినట్లు ఉన్నారని ఎద్దేవ చేశారు. షరతులకు కట్టుబడి ఉండకపోతే న్యాయస్థానం తీసుకునే చర్యలకు బాబు బద్ధుడై ఉండాలన్నారు.

జగన్మోహన్‌రెడ్డి నిర్ణయానికి కట్టుబడి ఉంటా.

పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా అందరం పని చేయాలని ఎమ్మెల్యే అన్నారు. అన్నారు. 2024లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నుండి పోటీ చేస్తారా? అని విలేకర్లు ప్రశ్నించగా ఎమ్మెల్యే స్పందిస్తూ జగన్మోహన్‌రెడ్డి తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. టిడిపి, జనసేన తెలంగాణలో కలిసి పోటీ చేయాలని నిర్ణయించినా తర్వాత పోటీ నుంచి టిడిపి తప్పుకుంటున్నట్లు ప్రకటించిందని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాజకీయాల్లో ఎప్పుడైనా ఎలాంటి నిర్ణయాలైనా ఉంటాయన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులు చల్లా అంజిరెడ్డి మృతి

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని 113 తాళ్లూరుకు చెందిన సిపిఎం గ్రామ కార్యదర్శి చల్లా అంజిరెడ్డి (65) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు, కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాల్లో అంజిరెడ్డి పాల్గొన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులుగా, గ్రామ కార్యదర్శిగా పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన భౌతిక కాయాన్ని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, మండల కార్యదర్శి మస్తాన్‌వలి సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకులు జి.బాలకృష్ణ, బి.రామకృష్ణ, ఎం.వెంగళరెడ్డి, ఇ.అంకమ్మరావు, ఎ.అంకమ్మరావు, సిహెచ్.వెంకటేశ్వర్లు, సిహెచ్.సాంబశివరావు ఉన్నారు.

చిత్రకళా పోటీల్లో వర్సిటీ విద్యార్థికి బహుమతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

తిరుపతికి చెందిన వేమన విద్యాకేంద్రం, తిరుపతి శ్రీ కళాక్షేత్ర సంయుక్తంగా నిర్వహించిన ఫైన్ ఆర్ట్స్ విభాగంలో వేమన పద్య భావనా చిత్ర కళా పోటీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి గర్నెపూడి కల్యాణ్ కుమార్ తృతీయ స్థానం సాధించారు. కల్యాణ్ కుమార్‌ను వీసీ పి.రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేజెండ్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని వెజెండ్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం టి.విజయశ్రీ బుధవారం తెలిపారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ఎంపికలో తమ పాఠశాల విద్యార్థిని చల్లగిరి గీతామాధురి, మట్టుపల్లి జయ సంజన, షేక్ సమీరా, జోగిపర్తి నాగూర్ బి, కోట్ల నాగమల్లేశ్వరి, తమ్మినేని మోహన వెంకట కార్తికరెడ్డి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన వారితోపాటు శిక్షణిచ్చిన పిఇటి టి.వెంకటేశ్వరరావు పలువురు అభినందించారు.



ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు కుటుంబంతో గిడుగు రుద్రరాజు

రైతు కుటుంబానికి నష్టపరిహారంగా రూ.25 లక్షల ఇవ్వండి

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-మాచర్ల

ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు శ్రీకాంత్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల నష్టపరిహార ఇవ్వాలని ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. వెల్దుర్తి మండలం, రచ్చమాలపాడు గ్రామానికి చెందిన యువ రైతు శ్రీకాంత్ మృతదేహన్ని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆయన సందర్శించి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.50వేలు సాయం అందజేసినట్లు చెప్పారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని సూచించారు. శ్రీకాంత్ పిల్లలకు తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో 400 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదిమందికి అన్నం పెట్టే రైతు ఎంతో కష్టం వస్తే గాని తన ప్రాణాలను తీసుకోడని వారి కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌ఛార్జి డాక్టరు యరమల రామ చంద్రారెడ్డి, సిహెచ్‌వెంకటేశ్వర్లు,టి.శ్రీనివాసరావు, జాని, రమేష్, వి.నాగరాజు, డి.శ్రీను పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న బొర్రా అప్పారావు

'రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి అధోగతి పాలు చేశారని జనసేన నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు విమర్శించారు. జనసేన సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు జనసేన టిడిపి సంకీర్ణ ప్రభుత్వ సంకల్ప యాత్రను బుధవారం ప్రారంభించారు. సత్తెనపల్లి మండలం నందిగామ నుండి ప్రారంబమైన సంకల్ప యాత్ర కంటెపూడి, కట్టావారిపాలెం, కొమెరపూడి వరకు కొనసాగింది. అనంతరం కొమెరపూడి లో అప్పారావు బసచేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని పేర్కొన్నారు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జనసేన టిడిపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. ముందుగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, జనసేన సత్తెనపల్లి మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు,జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు బత్తుల కేశవ, ఏడో వార్డ్ కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్,చిలక పూర్ణ, చిలక సత్యం, ఖాసీం,టిడిపి సత్తెనపల్లి మండల అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరావు,తదితర జనసేన- టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశంలో భాషా ప్రాతి పదికన ఏర్పాటు అయిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని జిల్లాకలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం అయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన అనంతరం మూడు రోజుల తదుపరి ఆంధ్ర రాష్ట్ర అవతరణను తొలి సారిగా ప్రకటన చేయడం జరిగిందన్నారు. 2014 సంవత్సరంలో ప్రత్యేక రాష్ట్రం విభజన నాటి నుండి పలు రంగాల్లో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు జిల్లా పరంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ఆవశ్యకత ఉందన్నారు. నూతన ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా నవంబరు లోపు వరికపూడిశెల ప్రాజెక్టు కు శంకుస్థాపనచేసి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎస్‌పి రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ విశాలాంధ్ర ఉద్యమం గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ , ట్రైని కలెక్టర్ కుమారి కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె. వినాయకం , జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. తొలుత వైద్య శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్త పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యా శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర చరిత్ర ఛాయాచిత్ర ప్రదర్శనను ఎంపి, ఎమ్మెల్యే, కలెక్టర్,ఎస్పీ, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, ట్రైనీకలెక్టర్ కల్పశ్రీ లు కలిసి ఛాయా చిత్ర ప్రదర్శనను చూశారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలో ఎస్పీ వై రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వై. శంకర్ రెడ్డి అమరజీవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాధనకోసం కృషి చేసిన మహనీయుల త్యాగాలకు గుర్తుగా జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, రామచంద్ర రాజు,ఏఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ, నరసరావుపేట డిఎస్పీ మహేష్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి

రొంపిచర్లలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

ఆంధ్ర చరిత్ర ఛాయా చిత్ర ప్రదర్శన

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆంధ్ర చరిత్ర ఛాయా చిత్ర ప్రదర్శనను పలువురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి కలెక్టర్ శివ శంకర్ తిలకించారు. ఈ ప్రదర్శనను తిలకించిన విద్యార్థులకుచారిత్రక ఘట్టాలపై క్విజ్ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను కలెక్టర్ అందజేశారు.

కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆంధ్ర చరిత్ర ఛాయా చిత్ర ప్రదర్శనను విద్యార్థులతో కలిసి తిలకిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- సత్తెనపల్లి

స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సహారా మౌలాలి,మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబ శివరావు, రూరల్ మండలం అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, పక్కాల సూరి బాబు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు ఎ.శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మండలంలోని గారపాడు, పెదకూరపాడు, తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పటానికి జరిగిన కృషి, చేసిన పోరాటాలను విద్యార్థినీ విద్యార్థులకు తెలిపారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో రొంపిచర్ల, గోగులపాడు గ్రామాలలో బుధవారం నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు, శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. తొలుత రొంపిచర్లలో పర్యటించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న ఆర్యవైశ్య కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆలయం బయట ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోగులపాడులో పర్యటించి మసీదు ప్రహరీగోడ నిర్మాణానికి, చర్చి నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి, మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, నరసరావుపేట పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త కపిలవాయి విజయ్ కుమార్,ఆలయధర్మకర్త మద్ది రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను మోసం వైసిపి ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ లను జగన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం వినుకొండ పట్టణంలోని 12వ వార్డులో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించగా జీవి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు చెందాల్సిన వేలకోట్ల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు తీరని ద్రోహం చేశారని వివరించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేకించి అమలు చేసిన స్వయం ఉపాధి పథకాలన్నీ అరాచక వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించడమే కాకుండా, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా పేరని ద్రోహం చేశారని విమర్శించారు. ఎస్సీ ఎస్టీలతోపాటు బీసీ ముస్లిం మైనారిటీలకు కూడా నిర్ణయం చేశారని దుయ్యబట్టారు.

న్యాయం గెలిచింది: యరపతినేని శ్రీనివాస్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు పెట్టి తప్పుడు ఆరోపణలు చేసి 52 రోజులు జైల్లో ఉంచారని, చివరికి న్యాయమే గెలుస్తుందని మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం శ్రీనివాసరావు మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గురజాల నియోజకవర్గంలో ఓట్లు అవకతవకలు జరిగాయని అధికారులు జరిగిన పొరపాట్లపై దృష్టి సారించాలని కోరారు.

క్రోసూరు మార్కెట్ యార్డులో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేయండి

ప్రజాశక్తి- క్రోసూరు

క్రోసూర్ మార్కెట్ యార్డులో సిసిఐ ద్వారా వెంటనే పత్తి కొనుగోలు చేయాలని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోక వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు లేక పత్తి రైతులకు పూర్తి నష్టం వచ్చిందని అన్నారు. ఎకరం ఒకటింటికి మూడు లేక నాలుగు క్వింటాలు ప్రతి దిగుబడి వచ్చిందని, గ్రామాలలో పత్తి ప్రైవేటు వ్యాపా రస్తులు ఐదువేల రూపాయలు నుండి 6500 వరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి మద్దతు ధర రూ. 7020 ఉండగా గోరుచుట్టుపై రోకటి పోటు వలె రైతులు వద్ద బ్రోకర్లు అతి తక్కువ ధరకు కొని రైతులను దగా చేస్తున్నారని అన్నారు.

వర్షాలు లేక పంట దిగుబడి రాక ప్రతి ఒక్క నెల రోజులు ముందుగా వచ్చినప్పటికీ సీసీఐ వారు ఇంతవరకు కొనుగోలు మొదలుపెట్టలేదు. మార్కెట్ యార్డ్ నందు సిసిఐ లో కూడా ప్రతి కొనుగోలు బ్రోకర్లు పల్లెలలో రైతుల దగ్గర తక్కువ రేటు కొనుగోలు చేసి సిసిఐలో రైతుల పేరట ఎక్కువ ధరకు అమ్ముతున్నారని విమర్శించారు. సీసీఐలో రైతు పాస్ పుస్తకం ద్వారా కానీ లేదా ఆధార్ కార్డు ద్వారా కానీ ప్రతిని కొనుగోలు చేసి రైతు బ్యాంకు ఎకౌంటు ద్వారా డబ్బులు చెల్లించి మార్గం చూసి బ్రోకర్ వ్యవస్థని అరికట్టాల్సిందిగా కోరారు. క్రోసూర్ మార్కెట్ యార్డ్ ద్వారా రెండు మూడు రోజుల్లో సీసీఐ ద్వారా ప్రతి కొనుగోలు చేయవలసిందిగా డిమాండ్ చేశారు.

గుంటూరు..

యూనివర్సిటీలో..

మంగళగిరిలో..

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాలు

జిజిహెచ్ సభలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తూ జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర 68వ అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సాయుధ పోలీస్ దళాలు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహానికి జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్ధసారధి, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధారరావు, జెసి జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అడిషనల్ ఎస్పీలు కె.సుప్రజ, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు (క్రైమ్), ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని చెప్పారు. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడిందన్నారు. ఉచిత పంటల బీమా కింద 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు అందిచామన్నారు. సూక్ష్మ సాగు నీటి పథకం ద్వారా 2023-24లో 740 మంది సన్నా, చిన్నకారు రైతులకు రూ.4.14 కోట్లతో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను 90 శాతం రాయితీతో అందించామన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి పథకం ద్వారా 40 యూనిట్లకు రూ.3.20 కోట్ల సబ్సిడీ అందించినట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 447 సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించి 1.52 లక్షల మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.221.69 కోట్లతో 83,659 మందికి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఔన్నత్యం, తెలుగు భాష గొప్పదనంపై జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఎం.పురుషోత్తం, ముంతాజ్ పఠాన్, కె.భవానీ, డైరెక్టర్లు కె.నాగేశ్వరి, పి.మేరి, కె.చిన్నపరెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, జెడ్‌పి సిఇఒ మోహన్‌రావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, ఆర్‌డిఒ పి.శ్రీఖర్, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె.స్వాతి పాల్గొన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షతన సభ నిర్వహించగా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి పార్ధ సారధి, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలేశారు. జెండాయ జెండాను సూపరింటెండెంట్ ఆవిష్కరించారు.

తెనాలిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అధికారులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సభ నిర్వహించగా వీసీ పి.రాజశేఖర్ మాట్లాడారు. మంగళగిరి పట్టణంలోని మెయిన్ బజార్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే ఆర్కే పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎం.మల్లేశ్వరరావు, ఎమ్‌డి ఫిరోజ్, ఎస్.బాలాజీ గుప్తా, డి.భగవన్నారాయణ, స్వరూప రాణి, కె.బోయేజు, బి.నర్సయ్య పాల్గొన్నారు. తాడికొండలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరులోని హిందూ కాలేజీ సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, మేయర్ మనోహర్‌నాయుడు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్పొరేటర్లు ఎస్.ఉమామహేశ్వరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. పొన్నూరులో పొట్టి శ్రీరాములు పవిత్ర స్మారక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఐలాండ్ సెంటర్లో సభ నిర్వహించగా ఎమ్మెల్యే కిలారు వెంకటరోశయ్య మాట్లాడారు. తెనాలిలో బోస్‌రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూలమాలలేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎం.హరిప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుల భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహాసభ నాయకుటు సాదుప్రతాప్ తదితరులున్నారు. టిడిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పూలమాలలేశారు. నాయకులు పి.వెంకట్రావ్, టి.హరిప్రసాద్, డి.యుగంధర్, ఎ.శివ పాల్గొన్నారు. బోస్‌రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ నివాళులర్పించారు. నాయకులు దివ్వెల మధుబాబు, జాకీర్ హుస్సేన్, హరిదాసు గౌరీశంకర్ పాల్గొన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో చిత్రపటానికి ఎంపిడిఒ బి.బాబురావు పూలమాలలేశారు.

పొన్నూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

ఓటర్ జాబితాపై పరిశీలన అవసరం

ప్రజాశక్తి - తెనాలి

ఓటరు జాబితాపై పూర్తిస్థాయి పరిశీలన అవసరమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో బుధవారం వేమూరు నియోజకవర్గ సమావేశం జరిగింది. ఆనందబాబు మాట్లాడుతూ ఓటర్ జాబితాను దగ్గర పెట్టుకుని ఇంటింటికి తిరిగి ఓట్లు పరిశీలించాన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజాధనాన్ని వైసిపి నేతలు దోపిడీ చేయడం, ఓటర్ వెరిఫికేషన్, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమాన్ని ప్రతి బూత్ పరిధిలో చేపట్టాలని చెప్పారు. సమావేశంలో నాయకులు కె.మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాపై కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కు సంబంధించి విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాపై డిసెంబర్ 9వ తేదీ వరకు క్లైములు, అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరిస్తామని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదాపై అభ్యంతరాలకు స్వీకరణకు ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెపారు. ఈవియం లు, వీవీప్యాట్‌లు ఫస్ట్ లెవెల్ చెకింగ్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సజావుగా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 4,365 బ్యాలెట్ యూనిట్లు, 3,525 కంట్రోల్ యూనిట్లు 3,973 వీవీప్యాట్లను పరిశీలించినట్లు తెలిపారు. అందులో 43 బ్యాలెట్ యూనిట్లు, 28 కంట్రోల్ యూనిట్లు, 17 వీవీప్యాట్లు యూనిట్లు రిజెక్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జెసి జి.రాజకుమారి, అడిషనల్ ఎస్‌పి సుప్రజ, ఆప్ నాయకులు టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, కాంగ్రెస నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, గుంటూరు ఆర్డీవో పి.శ్రీఖర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఇన్‌ఛార్జి) శ్రీనివాస్, ఇఆర్‌వోలు, ఎఇఆర్‌వోలు పాల్గొన్నారు.

జిఎన్‌టి-10 సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రిక్వెస్ట్ బస్‌స్టాప్ కోసం ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలం కేంద్రమైన ఫిరంగిపురంలోని మార్నింగ్ స్టార్ కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పవన్ కుమార్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా ప్రస్తుతం ఎత్తేశారని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విద్యార్థులు కాలేజీకి వచ్చే సమయాలైన ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 5.30 గంటల వరకు బస్సు సర్వీసులు తిప్పాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రతాప్, షరీఫ్, యశ్వంత్, అఖిల్ ఉన్నారు.

తాడేపల్లి సిఐగా మల్లికార్జునరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి నూతన సిఐగా ఎ.మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చీరాల వన్‌టౌన్ సిఐగా విధులు నిర్వర్తించిన మల్లికార్జునరావు తాడేపల్లి హెస్‌హెచ్‌ఒగా విధులు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో అందరి సహకారం తీసుకుని ముందుకు సాగుతానని చెప్పారు. గతంలో ఇక్కడ పని చేసిన శేషగిరిరావు చీరాలకు బదిలీ అయ్యారు.

వివిఐటి అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన అధ్యాపకులు నాగాయలంక దుర్గారావు డాక్టరేట్ పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. తమ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న దుర్గారావు 'డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్'పై చేసిన పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు చెప్పారు. 'స్కిన్ కేన్సర్ డయాగ్నసిస్ విత్ ఎన్హాన్స్డ్ ఆప్టిమైజేషన్' అంశంపై సమర్పించిన పరిశోధన పత్రాలకు గాను ఆయనకు డాక్టరేట్ లభించిందని చెప్పారు. డాక్టర్ దుర్గారావును వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎంవై భానుమూర్తి అభినందించారు.

దుర్గారావును అభినందిస్తున్న చైర్మన్ విద్యాసాగర్

మాట్లాడుతున్న పి.కోటిరావు

విద్యుత్ రాయితీ బకాయిలివ్వండి

టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నష్టాల్లో ఉన్న టెక్స్‌టైల్ మిల్లులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కోటిరావు కోరారు. గుంటూరులోని లక్ష్మీపురం అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ క్లిష్టపరి స్థితులను ఎదుర్కొంటోందన్నారు. కరోనా తర్వాత మారిన మార్కెట్ పరిస్థితులు, పెరిగిన పత్తి ధరలు, తగ్గిన నూలు ధరలు, విద్యుత్ అదనపు ఛార్జీల భారం వల్ల తమ పరిశ్రమ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన విద్యుత్ రాయితీలు ఈ ఏడాది ఇంత వరకు విడుదల కాలేదని చెప్పారు. సిఎఫ్ఎంఎస్‌లో రూ.192 కోట్ల బకాయిల బిల్లులు అప్‌లోడ్ చేసి నెలలు గడిచినా ఇంత వరకు నిధులు రాలేదని, ఫలితంగా తమ మిల్లులు మూతపడే పరిస్థితి నెలకొందని, లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో లక్ష మందికి పరోక్షంగా కార్మికుల ఉపాధికి దెబ్బ తగులుతోందని వివరించారు. విద్యుత్ సబ్సిడీ తెలంగాణలో అందచేస్తున్నట్టుగా రాష్ట్రంలోనూ యూనిట్‌కు రూ.2 ఇవ్వాలన్నారు. విద్యుత్ డ్యూటీ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, ఇతర అదనపు ఛార్జీలను మినహాయింపులు ఇవ్వాలన్నారు. తమ పరిశ్రమ స్థిరమైన ఇంధన వనరులకు సహాయపడటానికి సౌర, పవన విద్యుత్ యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. తమ పరిశ్రమ వల్ల ప్రభుత్వానికి జిఎస్‌టి రూపంలో రూ.కోట్ల ఆదాయం వస్తోందని చెపారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎల్.రఘురామిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు, ఎంవి సత్యనారా యణ, పి.వీరయ్య, కె.నాగిరెడ్డి, డి.సూర్య ప్రకాశరావు, బి.బెనర్జి, కోశాధికారి పి.చలపతిరావు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీల కోసం 8న విద్యాసంస్థల బంద్

సహకరించాలని విద్యార్థి, యువజన సంఘాల రౌండ్‌టేబుల్ పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

విశాఖ ఉక్కు ప్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్ అధ్యక్షతన జరిగిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యవక్తగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అపాలని ఉద్యమం ప్రారంభించి ఈనెల 8వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్‌కు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. 32 మంది బలిదానం, వేలాది మంది త్యాగాలతో నిర్మించిన విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేటీకరించాలని ప్రయత్నించటం దారుణమన్నారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన హామీలలో భాగంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పినా 9 ఏళ్ల నుండి శంకుస్థాపనలకే పరిమితం అయ్యిందన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అన్ని వసతులు, దగ్గరలో ఓబులాపురం గనులు ఉన్నాయని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీని గురించి పట్టించుకోవట్లేదని విమర్శించారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎమ్.కిరణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు సుబాని, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కట్టా జవహర్‌బాబు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి, ఎన్‌యస్‌యుఐ నగర అధ్యక్షులు షేక్ కరీం మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీగా ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు జరుగుతున్న బంద్‌కు జిల్లాలోని కెజి నుండి పీజీ వరకూ విద్యాసంస్థలు అన్నీ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.నరసింహ, ఎస్.కె.సమీర్, నాయకులు భగత్‌సింగ్, యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షులు సుచరిత, మౌనిక వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళ్లం హరనాథరెడ్డి జయంతి సందర్భంగా రక్తదానం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం కళాశాల వ్యస్థాపకులు కళ్లం హరనాథరెడ్డి 88వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లం హరనాథరెడ్డి స్మృతివనంలో కళ్లం గ్రూపు సంస్థల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి అంజలి ఘటించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. తలసేమియా బాధితులకు ఉపయోగించేందుకు నీడ్స్ తలసేమియా బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమా శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్ డి.శ్రీనివాసులు, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు పాల్గొన్నారు.

హరనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళ్లం గ్రూపు చైర్మన్, తదితరులు

త్రోబాల్ జాతీయ జట్టుకు విజ్ఞాన్స్ విద్యార్థిని

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ జట్టుకు ఎంపికైన భార్గవితోపాటు, రాష్ట్ర జట్టులో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, సిఎస్ఇ రెండో సంవత్సరం విద్యార్థిని కిలారు భార్గవి ఆలిండియా త్రోబాల్ జట్టుకు ఎంపికైనట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణం తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బిజునూర్‌లో జరిగిన 43వ సీనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్-2023 టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రదర్శనకుగాను తమ విద్యార్థి ఆలిండియా జట్టుకు ఎంపికైందని, వచ్చే సంవత్సరం జనవరిలో దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో భార్గవి పాల్గొననున్నట్లు తెలిపారు. యుపిలో జరిగిన టోర్నమెంట్‌లో ఎపి నుండి తమ యూనివర్సిటీ విద్యార్థులు కిలారు భార్గవి, కేతినేని గాయత్రి, మామిళ్లపల్లి తేజస్వి, కట్టా వైష్ణవి, ఇంకుర్తి శ్రీవర్షిత పాల్గొన్నారన్నారు. వీరిని వీసీతోపాటు రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాధన్ తదితరులు అభినందించారు.

గుంటూరులో వికాస్ హాస్పిటల్ ప్రారంభం

- పాల్గొన్న మంత్రులు విడదల రజనీ, అంబటి రాంబాబు
- ఆత్మీయ వైద్యం అందించేందుకు కృషి : చైర్మన్ రామచంద్రరావు

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని

ఓ విభాగంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కలెక్టరేట్ రోడ్డులో ఏర్పాటు చేసిన వికాస్ ఆస్పత్రిని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజనీ బుధవారం ప్రారంభించారు. పలు విభాగాలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, కరణం బలరాం, మద్దాలి గిరిధర్, డిప్యూటీ మేయర్ సజీల, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసిపి అద్దంకి నాయకులు బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.రామాంజనేయులు, కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మచిలీపట్నం పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, వికాస్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజనీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో 100 పడకలతో ఆస్పత్రిని ప్రారంభించడం ముదావాహమని, ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అన్ని సౌకర్యాలతో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను మంత్రి రజనీ అభినందించారు. ప్రజలు వికాస్ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ సేవలను పేదలకు అందించాలన్నారు. హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ గుంటూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, అడ్వాన్సు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తామని చెప్పారు. అసమాన ప్రతిభ కలిగిన వైద్యులు తమ అనుభవంతో రోగులకు మెరుగైన చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వికాస్ హస్పిటల్స్ డైరెక్టర్లు డాక్టర్ సుధాకర్ కనుమూరి, డాక్టర్ సురేంద్ర నాగులపాటి, డాక్టర్ కనకదుర్గ తదితరులు మాట్లాడుతూ అపార నైపుణ్యం, అనుభవం కలిగిన డాక్టర్ల బృందం కేవలం మందులతోనే కాకుండా మనస్సుపెట్టి వైద్యం అందిస్తుందని చెప్పారు. రోగులకు ఆత్మీయతతో చికిత్సలు జరుగుతాయన్నారు.

నేచురోపతిపై సుమేధా హైస్కూల్లో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ ఉమాసుందరి

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి-పూణే వారి సహకారంతో రోగ విముక్త భారత్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి త్రిగుణ నేచర్ క్యూర్ హెల్త్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమాసుందరి పాల్గొని నాచురోపతి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. నాచురల్ ఆహార పదార్థాలను పిల్లలకు అందచేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లైమెట్ ఫోరం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ది ఇంటర్నేషనల్ వియన్నా ఎనర్జి అండ్ క్లైమేట్ ఫోరం కాన్ఫరెన్స్‌లో భాగంగా గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్వీడన్‌లోని స్వీడిష్ ఎన్విరాన్మెంట్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్, వేస్ట్ టు ఎనర్జి ప్లాంట్‌లను యునిడో ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, క్లీన్ సిటీలపై అక్టోబర్ 29 నుండి నవంబర్ 5 వరకు స్వీడన్, ఆస్ట్రియాల్లో కమిషనర్ పర్యటించారు. రీసర్చ్ ఇనిస్టిట్యూట్, ఎనర్జి ప్లాంట్‌లో వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న ఆధునిక విధానాలు, వ్యర్థాలు ఉత్పత్తయ్యే నివాసాలు, సంస్థల నుండి ప్లాంట్‌లకు వ్యర్థాలు తరలించడం, కార్మికులతో కాకుండా యంత్రాలతో వ్యర్థాలను తడి, పొడి, ప్లాస్టిక్, ఇతర వస్తువులుగా వేరు చేయడం, వాటిని తిరిగి ఉపయోగపడే వస్తువులుగా మార్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం నేరుగా ఇళ్ల నుండి వ్యర్థాల సేకరణ విధానాన్ని పరిశీలించారు. లింకోపింగ్ యూనివర్సిటీ బృందంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కి సంబంధించి వివిధ అంశాలపై చర్చల్లో పాల్గొన్నారు.